

9న ప్రత్తిపాడులో టిడిపి సభ వాయిదా

ప్రజాశక్తి - జగ్గంపేట

ఈ నెల 9న ప్రత్తిపాడులో జరిగే చంద్రబాబు బహిరంగ సభ వాయిదా పడినందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ తెలిపారు. మండలంలోని ఇర్రిపాకలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనివార్య కారణాల వల్ల 9న ప్రత్తిపాడులో జరిగే బహిరంగ సభ వాయిదా వేయడం జరిగిందని, తిరిగి ఎప్పుడు ఎక్కడ జరిగేది తెలియ చేస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 10వ తేదీన జగ్గంపేటలోని పరిణయ ఫంక్షన్ హాల్లో టిడిపి, జనసేన ఉమ్మడి కార్యాచరణ కోసం ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ఎ.భాస్కరరావు, డివి.సూర్యనారాయణ, బి.అచ్చన్న దొర, ఎం.సిరి, డి.సీతారామకృష్ణ పాల్గొన్నారు.

యథేచ్ఛగా కల్తీ నెయ్యి..!

-ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం
-హోటళ్లు, స్వీటు దుకాణాలకు సరఫరా

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

డబ్బు సంపాదనే లక్ష్యంగా అక్రమార్కులు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. యథేచ్ఛగా కల్తీ నెయ్యి రాకెట్‌ను యథేచ్ఛగా నడుపుతూ లక్షలాది రూపాయలను ఆర్జిస్తున్నారు. ఆహార పదార్థాల్లో విరివిగా వినియోగించే నెయ్యిని కల్తీ చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా వివిధ రసాయనాలను, కొవ్వు పదార్థాలను వినియోగిస్తూ తయారు చేస్తున్న కల్తీ నెయ్యి వలన ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నా అధికారులు అరకొర చర్యలకే పరిమితం అవుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని ఖరీదైన హోటళ్లతో పాటు రుచికరమైన టిఫెన్ స్టాల్స్, బిర్యానీ పాయింట్లు, పేరుగాంచిన స్వీటు దుకాణాల్లో కల్తీ నెయ్యి విచ్చలవిడిగా వినియోగిస్తున్నారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి.



జి.రాగంపేటలో స్వాధీనం చేసుకున్న కల్తీ నెయ్యి డబ్బాలు(ఫైల్ ఫొటో)

కల్తీ నెయ్యి రాకెట్ గుట్టురట్టు

పెద్దాపురం మండలం జి.రాగంపేటలో నిర్వహిస్తున్న అంజి డెయిరీలో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారంపై విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు గతనెల 28న తనిఖీలు చేపట్టి కల్తీ నెయ్యి రాకెట్ గుట్టురట్టు చేశారు. డెయిరీ యాజమాని పిల్లి రవికిరణ్ ఫస్సయి విక్రయానికి లైసెన్స్ తీసుకుని, నెయ్యి తయారీకి లైసెన్సు పొందకుండానే నెయ్యి తయారీ చేస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఫుడ్ సేఫ్టీ అధికారులు శుద్ధి చేసిన పామాయిల్, ఆవు నెయ్యిను పరీక్షల నిమిత్తం నమూనాలు సేకరించారు. శుద్ధి చేసిన 648 కేజీల పామాయిల్, 216 కేజీల నెయ్యి స్వాధీనం చేసుకున్నారు. ధృవీకరించని కాటా కలిగి ఉన్నందున, ప్యాకింగ్ లైసెన్స్ లేకపోవడం, ప్యాకింగ్ బాటిల్స్‌పై కస్టమర్ కేర్ వివరాలు లేకపోవడం వలన లీగల్ మెట్రాలజి అధికారులు 3 కేసులు నమోదు చేశారు. అలాగే తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం పొలమూరులో ధనేశ్వరి ఫుడ్ ప్రొడక్ట్స్‌లో గత నెల 14న కల్తీ నెయ్యిని అధికారులు గుర్తించారు. విజిలెన్స్, రెవెన్యూ, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులతో కలిసి తనిఖీ చేయగా తయారీలో వెన్నను కాకుండా సన్‌ఫ్లవర్ ఆయిల్, వనస్పతి, కృత్రిమ నెయ్యి ఫ్లేవర్ ఏజెంట్, జాబిలాల్ సీడ్స్ (రసాయనాలు) తదితర వాటిని ఉపయోగించి కల్తీ నెయ్యిని తయారు చేస్తున్నట్లు గుర్తించారు. 7.90 లక్షల విలువైన కల్తీ నెయ్యిని, యంత్రాలు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు కోసం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరిపై కూడా లీగల్ మెట్రాలజి అధికారులు 3 కేసులను నమోదు చేశారు. ఇటువంటి దాడులు తూతూమంత్రంగానే జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

కల్తీని ఎలా గుర్తించాలి

కల్తీ నెయ్యిని గుర్తించడం చాలా సులభం. నెయ్యిని కరిగించి ఒకసారి ఆ రంగుని పరిశీలిస్తే గోధుమ రంగులోకి మారితే అది స్వచ్ఛమైన నెయ్యి అని అర్థం. పసుపచ్చ రంగులోకి మారితే కల్తీ నెయ్యిగా పరిగణించాలి. అలాగే అరి చెయ్యికి రాసుకుంటే చిన్న చిన్న గింజలుగా ఏర్పడితే కల్తీ నెయ్యిగా గుర్తించాలి. స్వచ్ఛమైన నెయ్యి అయితే చేతిలో కలిసిపోతుంది. మంచి నాణ్యమైన దేశీ నెయ్యి తీపి, రుచికరమైన వాసన కలిగి ఉంటుంది. నెయ్యి ఏదైనా విచిత్రమైన వాసన కలిగి ఉంటే, అది స్వచ్ఛమైనది కాదని అర్థం అని అధికారులు చెబుతున్నారు. దేశీ నెయ్యిని కొనుగోలు చేస్తున్నట్లయితే నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేసి, అది వాటికి అనుగుణంగా ఉందని నిర్ధారించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికాశుక్లా

పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి - కాకినాడ

పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. రానున్న లోక్ సభ, అసెంబ్లీ సాధారణ ఎన్నికలు-2024 నిర్వహణ ప్రక్రియలో పాల్గొనే పోలింగ్ అధికారులు, సిబ్బంది, సర్వీస్ ఓటర్లుకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా, వృద్ధులు, దివ్యాంగులకు హోమ్ ఓటింగ్ ద్వారా ఓటు హక్కు కల్పన అంశంపై మంగళవారం ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు, నోడల్ అధికారులు, వివిధ శాఖల అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు, జెసి సివి.ప్రవీణ్ ఆదిత్య పోస్టల్ బ్యాలెట్ పోల్ మేనేజ్మెంట్, పోస్టల్ బ్యాలెట్‌కు అర్హులైన అధికారులు, సిబ్బంది డేటా, ఫెసిలిటీ సెంటర్ నిర్వహణ, ఫారం-12, 12డి, బ్యాలెట్ పేపర్, సర్వీస్ ఓటర్లకు ఇ-పోస్టల్ బాలెట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే అధికారులకు, సర్వీస్ ఓటర్లకు, ఎసెన్షియల్ సర్వీసెస్ అందించే సిబ్బంది తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. నిర్ధేశించిన సూచనల కనుగుణంగా ఈ సదుపాయాన్ని రానున్న సాధారణ ఎన్నికల్లో అర్హులైన సిబ్బంది అందరికీ కల్పించాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ పోల్ మేనేజ్మెంట్‌పై ఇఆర్‌ఒలు సమగ్ర అవగాహన పెంపొందించుకుని ఈ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. పోలింగ్ సిబ్బందితోపాటు, ఎన్నికల కమిషన్ ద్వారా అథారిటీ లెటర్ పాస్ పొంది ఎన్నికల అంశాల కవరేజిలో పాల్గొనే మీడియా ప్రతినిధులు కూడా పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చునని ఆమె తెలిపారు. అలాగే 85 సంవత్సరాల పైబడిన వృద్ధులకు, 40 శాతం అంగవైకల్యం కలిగిన దివ్యాంగులకు తమ ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునేందుకు హోమ్ ఓటింగ్ సదుపాయం, దాని విధివిధానాలపై వివరించారు. ఆయా నియోజకవర్గాల్లో సీనియర్ ఎఆర్‌ఒలను పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారిగా నియమించడం జరుగుతుందని, ఇందుకు అవసరమైన ఫెసిలిటీ సెంటర్స్ ఇఆర్‌ఒలు ఏర్పాటు చేయాలని తెలిపారు. నియోజకవర్గాల వారిగా ఎంతమందికి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాలో ముందుగా జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. తొలి విడత శిక్షణ కార్యక్రమంలో పోస్టల్ బ్యాలెట్ల జారీ చేసి, 2వ విడత శిక్షణా కార్యక్రమంలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ నిర్వహించాలని జెసి ప్రవీణ్ ఆదిత్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పిం చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిఆర్‌ఒ డి.తిప్పే నాయక్, అదనపు ఎస్‌పి జెఎన్‌వి. భాస్కరరావు, కమిషనర్ జె.వెంకటరావు, ఆర్‌డిఒలు ఇట్ల కిషోర్, జె.సీతారామరావు, డిఎం అండ్ హెచ్‌ఒ డాక్టర్ జె.నరసింహనాయక్, ఆర్‌టిఒ ఎం.శ్రీనివాసు, ఎపి ఇపిడిసిఎల్ ఇఇ ప్రసాద్, డిఎల్‌డిఒలు పి.నారాయణ మూర్తి, కెఎస్ఎన్‌వి. ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

సిద్ధం సభలో సునీల్ హామీల వర్షం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

కాకినాడ పార్లమెంటు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ చలమలశెట్టి సునీల్ సిద్ధం సభలో హామీల వర్షాన్ని కురిపించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ వరుపుల సుబ్బారావు అధ్యక్షతన మంగళవారం సిద్ధం సభ జరిగింది. ఈ సభలో సునీల్ పాల్గొని కాకినాడ పార్లమెంట్ పరిధిలోని 400 గ్రామాలను దత్త తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఒక్కో గ్రామానికి రూ.కోటి చొప్పున సొంత నిధులతో అభివృద్ధి చేస్తానని అన్నారు. పెద్దఎత్తున ఫ్యాక్టరీలను తీసుకొచ్చి యువకులకు ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఇన్‌ఛార్జ్ పరుపుల సుబ్బారావు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో అస్తవ్యస్తంగా మారిన రహదారుల నిర్మాణానికి, ఏలేరు, సుబ్బారెడ్డి సాగర్ ఆధునీకరణకు, గ్రామాలలో మౌలిక వసతులు కల్పనకు తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి అనంత ఉదయభాస్కర్, ఎంపిపి గొల్ల క్రాంతిసుధాకర్, జడ్‌పిటిసి సభ్యులు బెహరా రాజరాజేశ్వరి పలువురు సర్పంచులు, ఎంపిటిసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సునీల్, సుబ్బారావులను సత్కరిస్తున్న వైసిపి శ్రేణులు

బకాయి వేతనాలు తక్షణం చెల్లించాలి

ప్రజాశక్తి - కాకినాడ

సమగ్ర శిక్షలో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగుల రెండు నెలల బకాయి వేతనాలు తక్షణం విడుదల చేయాలని సిఐటియు జిలాల అధ్యక్ష, ప్రధాన కార్యర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్‌లో ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 2023 డిసెంబర్ 20 నుంచి 2024 జనవరి 11వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగుల 21 రోజుల సమ్మె చేశారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరిస్తూ ఆదేశాలు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ఆ హామీలు ఇచ్చి నేటికి రెండు నెలలు గడుస్తున్నా హెచ్‌ఆర్ పాలసీ కమిటీని ఇంతవరకు నియమించలేదని తెలిపారు. తక్షణం ఇచ్చిన హామీల మేరకు ఆదేశాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు, చిరుద్యోగులైన సమగ్రశిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు జీతాలు రాక ఇంటి అద్దెలు, పిల్లల చదువులకు ఫీజులు చెల్లించలేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. తక్షణమే బకాయి పడిన రెండు నెలల వేతనాలను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యోగులందరూ ఆందోళన చేయడానికి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమగ్రశిక్షా అమలుకు కేంద్రం నిధులు విడుదల చేసినా, రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను ప్రభుత్వ ఇతర అవసరాలకు మళ్లించడంవల్లే వేతనాలు బకాయపెట్టే పరిస్థితి ఎదురయ్యిందని విమర్శించారు.

పట్టాలిచ్చారు.. స్థలాలు చూపించాలి..

ప్రజాశక్తి - తాళ్లరేవు

జగనన్న ఇళ్ల స్థలాల పేరుతో పట్టాలు ఇచ్చి రెండేళ్లు గడిచిన నేటికీ స్థలాలు చూపించలేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు అన్నారు. ఎన్నికల కోడ్ రాక ముందే లబ్ధిదారులకు వెంటనే స్థలాలు చూపించాలని డిప్యూటీ తహశీల్దార్ సూరి బాబుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభు త్వం జగనన్న ఇండ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పటవల, కోరంగి, తాళ్ళరేవు గ్రామానికి చెందిన కొంతమందికి బొడ్డువానిలంక గ్రామంలోనూ, తాళ్లరేవు గ్రామానికి చెందిన కొంతమందికి గాడిమొగ గ్రామంలో పట్టాలు ఇచ్చారని తెలిపారు. అయితే నేటికీ లబ్ధిదారులకు స్థలాలు ఎక్కడ ఉన్నాయో చూపించ లేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కారణం గా అధికారులు వెంటనే స్పందించి పట్టా లు పొందిన లబ్ధిదారులకు ఆయా గ్రా మాల్లో స్థలాలు కొలిచి అప్పగించాలని డిమాండ్ చేశారు. అలాగే తాళ్లరేవు గ్రామంలో యాదవుల ఏరియా, రచ్చవారి పేట ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారని తక్షణమే సమస్య ను పరిష్కరించాలని ఇఒపిఆర్‌డి మల్లాడి భైరవమూర్తికి వినతిపత్రం అందించారు.



అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఈశ్వరరావు

చలో విజయవాడకు తరలిన హమాలీ కార్మికులు

ప్రజాశక్తి - సామర్లకోట

ఎపి బేవరేజ్ హమాలీ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక డిపో కార్మికులు చలో విజయవాడకు తరలివెళ్లారు. పెరిగిన ధరలకు అనుగుణంగా దిగుమతి కూలి ధరలను పెంపుదల చేయాలని, పిఎఫ్, ఇఎస్‌ఐ సౌకర్యాలను కల్పిం చాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని సామర్లకోట, అమలాపురం డిపోలకు చెందిన హమాలి కార్మికులు మంగళవారం ఉదయం పాస్ట్ ప్యాసెంజర్ రైలులో విజయ వాడకు తరలి వెళ్లారు. సామర్లకోట నుంచి తరలి వెళ్లిన వారిలో డిపో యూనియన్ నాయ కులు బి.ఆదినారాయణ, వి.గోవిందు, యు.సతీష్, కె.దుర్గాప్రసాద్, ఎం.వీర బాబు, బి.రామారావు ఇతర కార్మికులు ఉన్నారు.



సామర్లకోట రైల్వే స్టేషన్లో బయలుదేరిన కార్మికులు



చెక్కును ఇస్తున్న సత్యనారాయణ

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సిఎం సహాయ నిధి నుంచి విడుదలైన చెక్కులను రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కురసాల సత్యనారాయణ బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. రమణయ్యపేటలోని ఎంఎల్ఎ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 12 మంది లబ్ధిదారులకు రూ.23 లక్షల 35 వేల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న వారికి సిఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్, సామర్లకోట

రాబోయే ఎన్నికలకు ప్రజలను సన్నద్ధం చేసేందుకు మండలంలోని ఇంద్రపాలెం, గంగనాపల్లి, కొవ్వాడ గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ సిఐ మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల నిమిత్తం ప్రజలకు శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేవిధంగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అదేవిధంగా ఎవరైనా ఎన్నికల సంఘం ఉత్తర్వులు ధిక్కరించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎలక్షన్ కేసుల్లో పాల్పడిన వారిపై నిఘా ఉంచడం జరుగుతుందని, అలాంటి వ్యక్తులు భవిష్య త్తులో ఎటువంటి ప్రభుత్వ ప్రయివేట్ ఉద్యోగాలు అర్హులు కారన్నారు. అదేవిధ:గా సామర్లకోట పట్టణంలోని బ్రౌన్ పేట, సీతారామ కాలనీ, సామర్లకోట మెయిన్ రోడ్డులో, స్టేషన్ సెంటర్, మఠం సెంటర్ ప్రాంతాల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా గాంధీబొమ్మ సెంటర్లో డిఎస్‌పి లతాకుమారి మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు, ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిఎస్‌పి ఈశ్వర్ యశ్వంత్, సామర్లకోట సిఐ డి.సురేష్, ఎస్‌ఐలు మూర్తి, మౌనిక పాల్గొన్నారు.



సామర్లకోటలో కవాతు నిర్వహిస్తున్న కేంద్రబలగాలు

ప్లంబర్స్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండల నవయుగ ప్రయివేట్ ఎలక్ట్రీషియన్ అండ్ ప్లంబర్స్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు మంగళవారం ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలు రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీహరిరావు, నాయకులు కె.పాల్‌రాజ్, సిహెచ్.నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం నూతన అధ్యక్షునిగా జెఎస్‌ఎస్.శ్రీనివాసరావు, కార్యదర్శిగా సిహెచ్.సత్యనారాయణ, ఉపాధ్యక్షునిగా ఎస్‌వి.రాజు, సహ కార్యదర్శులుగా కె.చిన్ని, గణేష్ గౌరవ అధ్యక్షునిగా ఆర్‌వి.కృష్ణకుమార్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా 50 సంవత్సరాల దాటిన ప్రయివేట్ ఎలక్ట్రీషియన్ మరియు ప్లంబర్‌లకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని తీర్మాణంచేశారు.

అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు




శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ కన్నబాబు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రూరల్ మండలం లోని రమణయ్యపేట, బాపన్న దొర కాలనీల్లో పలు అభివృద్ధి కార్యాక్రమాలను ఎంఎల్ఎ కురసాల కన్నబాబు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో రూ.25.లక్షలతో సచివాలయం భవనం, రూ.25 లక్షలతో రెండు పార్కులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం కాలనీవాసులకు అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూరల్ నియోజకవర్గం అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కురసాల సత్యనారాయణ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లింగం రవి, మాల కార్పొరేషన్ డైరెక్టర్ గగరిన్, మార్కెట్ డైరెక్టర్ రేఖ అబ్రహంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి దవులూరి రమణ, ఎఇ వాసుదేవరావు, వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు గంజా సత్తిబాబు, పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్‌పై సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అనే అంశంపై అవగాహన సదస్సు మంగళవారం ప్రారంభం అయ్యింది. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సులో విశిష్ట ఇన్నోవేటర్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఎండి సాయి సాందీప్ మాట్లాడారు. ఇంటర్నెట్ యుగంలో ఈ టెక్నాలజీ ఎంతో ఉపయోగపడు తుందన్నారు. ఈ టెక్నాలజీ ద్వారా వివిధ పరికరాలను అనుసంధానం చేయవచ్చునని వివరించారు. డేటా మార్పిడి చేసేవిధానం తోపాటు, టెక్నాలజీతో పనిచేసే వివిధ పరికరాలు వాటి ఉపయోగాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు హోమ్ ఆటోమేషన్ మరియు ఎఐ రోబోట్ తదితర అప్లికేషన్స్‌పై శిక్షణ ఇచ్చినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డోలా సంజయ్.ఎస్ అన్నారు. భవిష్యత్తులో గృహాలలో గల పరికరాలను ఒక దానితో ఒకటి అనుసంధానం చేసుకోవచ్చునని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ డిపార్ట్మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఆర్‌వివి. కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులందరూ నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి సూచించారు. ఈ సదస్సును ఎలక్ట్రానిక్స్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బివి.విజయశ్రీ, అసోసియేట్ ప్రొఫెసర్.విశ్వనాథపల్లి ప్రీతి ఆధ్వర్యంలో నిర్వహించారు.




సదస్సులో మాట్లాడుతున్న సాయి సందీప్

నైపుణ్య శిక్షణపై అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని దివిలి గ్రామంలోని కిట్స్ మహిళల ఫార్మసీ కళాశాల, విశాఖ సిఎస్‌సి అకాడమీ మధ్య ఉపాధి నైపుణ్య శిక్షణపై అవగాహనా ఒప్పందం జరిగింది. మంగళవారం కళాశాలలో జరిగిన ఒప్పంద సమావేశంలో సిఎస్‌సి అకాడమీ సలహాదారు వై.రామ్మోహన్‌రావుతో ప్రిన్సిపల్ డాక్టర్ గుడిపాటి మధు అవగాహన ఒప్పందాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా కన్సల్టెంట్ వై రామ్మోహనరావు మాట్లాడుతూ ఉపాధి నైపుణ్య శిక్షణ ద్వారా వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, ఎన్ఐఇఎల్ ఐటి ద్వారా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు 3 డి ప్రింటింగు, రోబోటిక్ ప్రాసెసింగ్, వాద్వానీ ఫౌండేషన్ ద్వారా 21వ శతాబ్దపు ఉపాధి నైపుణ్యాలను, పారిశ్రామిక వ్యవస్థాపక శిక్షణ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గుడిపాటి మధు, రీసెర్చ్, డెవలప్‌మెంట్ సీనియర్ అడ్వైజర్ డాక్టర్ మురళీకృష్ణ, కిట్స్ కళాశాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జెన్నీబాబు, ఫ్యాకల్టీ విద్యార్థులు పాల్గొన్నారు.



పత్రాలను మార్చుకుంటున్న నిర్వాహకులు

బాంబే హైకోర్టు తీర్పు హర్షణీయం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మానవ హక్కుల సంరక్షణ నాయకుడు, ప్రొఫెసర్ సాయిబాబాను నిర్దోషిగా బాంబే హైకోర్టు తీర్పు ఇవ్వడంపై ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్(ఐలాజ్) రాష్ట్ర నాయకుడు బుగత శివ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ప్రొఫెసర్ సాయిబాబాను భీమా ఖోరెగావ్ కుట్రలో సంబంధాలు ఉన్నాయని, ఎన్ఐఎ 10 ఏళ్ల క్రితం ఉపా చట్టం కింద జైల్లో పెట్టడం దారుణం అన్నారు. వికలాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబాపై బెయిలుకు అవకాశం లేని ఉపా చట్టం ప్రయోగించడం అన్యాయమని అప్పట్లో మేధావులు, మానవతావాదులు ఎన్ని ఉద్యమాలు చేసినా ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు.

పల్స్ పోలియో నూరు శాతం పూర్తి

ప్రజాశక్తి - కాజులూరు

పల్స్ పోలియో నూరు శాతం పూర్తయిందని గొల్లపాలెం పిహెచ్‌సి వైద్య అధికారిణి ఎన్ .సౌజన్య తెలిపారు. మంగళవారం గొల్లపాలెం, దగ్గుదుర్రు పిహెచ్‌సి సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ తమ పిహెచ్‌సి పరిధిలో 2,357 మందికి పోలియో చుక్కలు వేశామని తెలిపారు. అలాగే దుగ్గుదుర్రు పిహెచ్‌సి పరిధిలో 2,284 మందికి పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 2276 మందికి వేసినట్లు దగ్గుదురు పిహెచ్‌సి వైద్యాధికారిణి సుప్రియ తెలిపారు. పోలియో చుక్కలు వేయడంలో సహకరించిన ఆశా వర్కర్లకు, వైద్య సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు శ్రేయ, వైద్య సిబ్బంది రాజారావు, సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - కాట్రేనికోన

కాట్రేనికోన మండలం పల్లంకుర్రు పరిధిలోని వడ్డివారిపేట వద్ద సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పల్లంకుర్రు గ్రామానికి చెందిన కస్సిరెడ్డి లక్ష్మణ్ అతని స్నేహితుడు సూర్యతేజతో కలిసి కెటిఎమ్ మోటార్ సైకిల్ పై బలుసుతిప్ప నుండి పల్లంకుర్రు వైపు వస్తుండగా, ఎదురుగా వస్తున్న ఏపీ.ఎం.పి బైకు మద్య సిద్ధార్థ గౌతమ్ మోటార్ వాహనాన్ని ఎదురెదురు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు తెలియచేసారు. కె.టి.ఎమ్ బైకు నడుపుతున్న లక్ష్మణకు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన అమలాపురం ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయాడు. అలాగే తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తి సిద్ధార్థ గౌతమ్ అతని భార్యను స్థానికులు కాట్రేనికోన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కొరకు అమలాపురం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా అతని పరిస్థితి విషమించడంతో కాకినాడ జి.జి.హెచ్ కు తరలించారు. చికిత్స పొందుతూ గౌతమ్ మంగళవారం తుదిశ్వాస విడిచినట్లు బంధువులు తెలిపారు. ఆయన భార్య పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు సమాచారం. గాయపడిన సూర్యతేజ పరిస్థితి మెరుగైనట్లు వైద్యులు తెలియచేసారు.

యువకుని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం మండలం తాండవపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఆక్వా చెరువుల వద్ద ఒడిశా కు చెందిన సందీప్(23) అనే యువకుని మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పప్పుల రామకృష్ణారావు అనే ఆక్వా రైతు చెరువు వద్ద పనిచేయడానికి ఒడిశా నుంచి ఈ కార్మికుడు వలస వచ్చినట్లు తెలిపారు. ఇంటికి వెళ్లాను అని చెప్పి గత నెల 29 నుంచి యువకుడు కనబడటంలేదన్నారు. మంగళవారం యువకుని మృతదేహం కనిపించడంతో స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-కడియం

మండలంలోని మాధవరాయుడు పాలెం పంచాయతీ పరిధి, గుబ్బలవారిపాలెం కు చెందిన శీలం వెంకన్న మద్యసీసాలను అమ్ముతుండగా సమాచారం మేరకు పట్టుకుని అరెస్ట్ చేసినట్లు కడియం సిఐ బి.తులసీధర్ తెలిపారు. అతని వద్ద నుండి 45 బీరు సీసాలు, నాలుగు విస్కీ సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ టి.కృష్ణ సాయి ఉన్నారు.

100 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక పాత పెద్దాపురంలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో 100 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో నిందితులు కోమలి రాజు, కోమలి యేసురత్నం లను అరెస్ట్ చేసినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. నాటు సారా కొందరు సరఫరా చేస్తున్నట్లు తమ వద్ద సమాచారం ఉందన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నాటు సారా తయారీ, అమ్మడం, రవాణా చేసే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

70 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు ఎస్ఇబి అధికారులు చేపట్టిన దాడుల్లో 70 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఎస్ఇబి సిఐ ఎల్.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. ఏలేశ్వరం శివారు అప్పన్నపాలెంలో 50 లీటర్ల సారాతో వ్యక్తిని, పొమ్మంగి గ్రామంలో 20 లీటర్ల సారాతో మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే అప్పన్నపాలెంలో సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు వివరించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ప్రత్తిపాడు ఎస్ఇబి ఎస్ఐ ఎం.ఆశాలత, సిబ్బంది వెంకన్న దొర, కృష్ణ అర్జునరావు, బి.కృష్ణ, రాజు, రాంబాబు, సరాం పాల్గొన్నారు.

తూనికల కొలతల అధికారుల దాడులు

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేటలో తూనికల కొలతల అధికారులు పలు దుకాణాలపై మంగళవారం దాడులు నిర్వహించారు. తూకాలు వేసే కాటాలు సక్రమంగా ఉన్నాయో లేదో సరి చూసి దుకాణదారులకు జరిమానాలు విధించారు. అలాగే ఆ తూకాలకు సీల్ వేశారు. ఈ దాడుల్లో పెద్దాపురం తునికల కొలతల అధికారులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



ఆర్ఎ మునిస్వామితో మాట్లాడుతున్న నాయకులు

సబ్ రిజిస్ట్రార్‌ను తక్షణమే నియమించాలి

ప్రజాశక్తి - యానాం

యానాం సబ్ రిజిస్ట్రార్‌ను తక్షణమే నియమించాలని పలువురు ప్రాంతీయ పరిపాలనాధికారి మునుస్వామిని కోరారు. యానాం విశ్రాంత పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, అన్నా డిఎంకె పార్టీ యానాం కార్యదర్శి మంచాల సత్యసాయికుమార్, కమిశెట్టి నాయుడు, చింతం అజయ్, ఏరుబండి స్వామి, చిట్టి రాజు తదితరులు మంగళవారం పరిపాలనాధికారిని కలిసి సబ్ రిజిస్ట్రార్ లేకపోవడం వల్ల కలుగుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే సబ్ రిజిస్ట్రార్‌ను నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సాహితీ సదస్సుకు శిఖామణికి ఆహ్వానం

ప్రజాశక్తి - యానాం

ఈ నెల 9, 10 తేదీల్లో కాకినాడలో జరుగుతున్న అఖిల భారత తెలుగు సాహితీ సదస్సులో పాల్గొనేందుకు ప్రముఖ కవి, కవిసంధ్య సంపాదకులు డాక్టర్ శిఖామణికి ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 30వ వార్షికోత్సవ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10న జరిగే సభలో దళిత కవిత్రయం కుసుమ ధర్మన్న, గుర్రం జాషువా, బోయి భీమన్న అనే అంశంపై తాను ప్రసంగించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో కవిసంధ్య 47వ సంచికను వంగూరి ఫౌండేషన్ అధ్యక్షుడు వంగూరి చిట్టెన్‌రాజు ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో చినరాజప్ప

ప్రజాశక్తి - పెద్దాపురం



ప్రచారంలో మాట్లాడుతున్న చినరాజప్ప

ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మంగళవారం పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ కోసం టిడిపి, జనసేన కూటమి రాబోయే ఎన్నికల్లో విజయం సాధించాల్సివుందని అన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ తిరోగమనంలోకి వెళ్లిపోయిందన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే సిఎంగా చంద్రబాబు తిరిగి రావాల్సివుందని, రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు, టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, కొరుకూరి రాజు, చాగంటి గోపాలకృష్ణ, బొడ్డు ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు సభకు తరలిన వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి - రౌతులపూడి

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వరుపుల సుబ్బారావు ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్తిపాడులో ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభకు మండలం నుంచి వైసిపి శ్రేణులు తరలివెళ్లారు. జడ్‌పిటిసి సభ్యులు గొల్లు లక్ష్మణమూర్తి, వైసిపి నాయకులు వాసిరెడ్డి జమీలు నాయకత్వంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు తరలి వెళ్లారు.

తోటకు జై కొట్టిన చంటిబాబు అనుచరులు



తోట ఇంటికి బైక్ ర్యాలీగా వెళ్తున్న చంటిబాబు అనుచరులు

ప్రజాశక్తి - జగ్గంపేట

ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు అనుచరుడుగా ఉన్న జగ్గంపేట గ్రామ ఉప సర్పంచ్ బండారు రాజా తన అనుచరులతో నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ తోట నరసింహంకు జై కొట్టారు. ఇప్పటి వరకూ ఆయన ఎంఎల్ఎకు మద్దతుగా నిలిచారు. మంగళవారం రాజా తన అనుయాయులతో స్థానిక రావులమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బైక్ ర్యాలీతో కిర్లంపూడి మండలం వీరవరం గ్రామం చేరుకుని నరసింహంకి పూలమాలలు వేసి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



కుట్టు మిషన్లతో మహిళలు

అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో కొప్పుశెట్టి సురేష్- అనిత దంపతుల 25వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రూ.1.75 లక్షల వ్యయంతో 25 కుట్టుమిషన్లను పేద మహిళలకు అందచేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ భర్త సంపాదనకు తోడుగా కుట్టు శిక్షణ పొందిన మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధిస్తారనే ఆశయంతో కుట్టుమిషన్లను అందజేస్తున్నామన్నారు. కుట్టు మిషన్లను ఇంట్లో అలంకార వస్తువుగా కాకుండా దాని ద్వారా ఉపాధి పొందాలన్నారు. లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం వృద్ధులకు భోజన ప్యాకెట్లతోపాటు స్వీట్స్, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, జిల్లా బాలల సంక్షేమ అధికారి సిహెచ్.వెంకట్రావు, జి.కృష్ణమోహన్, గల్లా సుబ్బారావు, అడబాల సత్యనారాయణ, రాజా పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - పెద్దాపురం



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థులకు

మండలంలోని జి రాగంపేట గ్రామంలో ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఆధునిక వ్యవసాయ విధానాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సర్పంచ్ బుంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ 45 రోజుల పాటు గ్రామంలో వ్యవసాయ విద్యార్థులు రైతులకు వివిధ వ్యవసాయ సేవలను అందిస్తారన్నారు. ఈ సందర్భంగా వారు రైతుల నుంచి వివిధ వ్యవసాయ మెలకువలను నేర్చుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు, అధ్యాపకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్చి 11 నుంచి సమ్మెకు సిద్ధం

ప్రజాశక్తి - కాకినాడ



ర్యాలీలో మాట్లాడుతున్న దువ్వా శేషబాబ్జి, సత్తిరాజు

జిజిహెచ్ శానిటేషన్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11 నుంచి సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధమౌ తున్నారు. ఈ మేరకు మంగళ వారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో కార్మికులు నిర్ణయించారు. ఆసుపత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ విఠల్ హామీ మేరకు ఈనెల 10 వరకు వేచి చూస్తామని స్పష్టం చేశారు. ఆసుపత్రి మాతా శిశు విభాగం వద్ద నుంచి ఓపి విభాగం వరకు నినాదాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జీ, పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు మాట్లాడుతూ పిఎఫ్ చట్ట ప్రకారం 12 శాతం కార్మికుల వాటా, 12 శాతం యజమానుల వాటా చెల్లించాల న్నారు. చట్ట విరుద్ధంగా కార్మికుల జీతాల నుంచి నెలకు సుమారు రూ.1600. కోత విధిస్తున్నారని అన్నారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని కార్మికుల డిమాండ్స్ పరిష్కారం చేయాలన్నారు. లేని పక్షంలో సిఐటియు అనుబంధ సంఘాలు, ఇతర కార్మిక ఉద్యోగ సంఘాల మద్దతుతో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, యూనియన్ అధ్యక్షుడు సిహెచ్.విజయ్ కుమార్ మాట్లాడుతూ గత నెల రోజులుగా విధులకు ఆటంకం లేకుండా ఆందోళన కొనసాగిస్తున్న అధికారుల్లోనూ, కాంట్రాక్టర్‌లోనూ ఎటు వంటి స్పందన లేదన్నారు. ప్రజలు, రోగులు, రోగుల బంధువులు జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ పోరాటానికి అండగా నిలబడాలని విజ్ఞప్తి చేస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె.శేషు, ఆర్. రమేష్, ఎస్. వాసు, బి. మంగతాయారు, కష్ణవేణి, తలుపుతమ్మ పాల్గొన్నారు.

ప్రజలకు తప్పని తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి - పెదపూడి

మండలంలో సంపర గ్రామంలో గత 15 రోజులుగా తాగునీరు లేక ప్రజలు కష్టాలను ఎదుర్కొంటున్నారు. మంగళవారం టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా సంపరలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అక్కడ మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. హై ఓల్టేజ్‌కి లోఓల్టేజ్‌కి తేడా తెలియని ఎంఎల్ఎ వల్ల ఈ పరిస్థితి దాపురించిందన్నారు. తక్షణం అధికారులు తాగునీరు అందించికపోతే టిడిపి, జనసేన ఉమ్మడి కార్యచరణతో పోరాటాన్ని సాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల వాణిజ్య విభాగ అధ్యక్షులు చిన్నారి, మండల జనసేన అధ్యక్షులు వీరస్వామి, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్, పెద్దాపురం

నవరత్నాలు పథకంలో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఇళ్ల స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పట్టాలను ఎంఎల్ఎ కురసాల కన్నబాబు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని సర్పవరంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్లో మంగళవారం సర్పంచ్ శీలం చిన్న అధ్యక్షతన పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. పేద ప్రజల సొంతింటికలను సాకారం చేయడంతోపాటు ఇచ్చిన స్థలాలపై పూర్తి హక్కును ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం వల్ల ఆస్తిపై మహిళలకు సంపూర్ణ హక్కు లభిస్తుందని తెలిపారు. ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకర్‌రావు, పుల్ల చంద్రరావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పుల్ల చందు, పుల్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో పుల్ల ధర్మరాజు, పుల్ల చక్రధర్, జోకా సత్యబాబు, గంటసాల సతీష్, వానపల్లి వీరబాబు, పుల్ల స్వాములు, వీరభద్రరావు, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు పూసల అనిల్ తదితరులు పాల్గొన్నారు. పెద్దాపురం పట్టణంలోని పలు సచివాలయాల పరిధిలో చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, ఆయా వార్డుల కౌన్సిలర్ల అధ్యక్షతన లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు పాల్గొని లబ్ధిదారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కెవి.పద్మావతి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆసక్తితో చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పిఎస్ రాజు

ప్రజాశక్తి - సామర్లకోట

పదవ తరగతి పరీక్షలకు సిద్ధపడే విద్యార్థులు సబ్జెక్టులపట్ల ఆశక్తిని కనపరుస్తూ చదవడం ద్వారా ఉత్తమ ఫలితాలు పొందవచ్చునని చంటి పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పిఎస్.రాజు అన్నారు. స్థానిక జడ్‌పి బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలకు సిద్ధపడే విద్యార్థులకు అవగాహనా సదస్సు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా విద్యార్థులు వారి మానసిక సామార్థ్యన్ని బట్టి వారి పఠన సమయాన్ని నిర్ణయించు కోవాలన్నారు. అలాగే సబ్జెక్ట్‌లను బట్టి వాటిపై విద్యార్థులకున్న పట్టును బట్టి సమయాన్ని కేటాయించాలని తెలిపారు. మేధస్సు సహకరించని సమయంలో ఎంత చదివినా ఫలితం ఉండదని అలాంటి సమయంలో కొంత విశ్రాంతి తీసుకుని మరలా సిద్ధపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు కెఎంఎస్ఆర్.ప్రసాద్, హైస్కూల్ హెచ్ఎం యు.మీనామాధురి, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగులాపల్లిలో ఎంపీ గీత పర్యటన




పర్యటనలో మాట్లాడుతున్న ఎంపి వంగా గీత

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంపి వంగా గీత మండలంలోని నాగులపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పాలనను అందిస్తున్న సిఎం జగన్‌ను రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని కోరారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు బూటకపు మాటలతో ప్రజలను నమ్మించేందుకు వస్తున్నారని, వారి మాటలను పట్టించుకోకుండా వైసిపిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైసిపి నాయకులు వడిశెట్టి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి, నాయకులు నక్క మణికంఠ, ఆనాల సుదర్శన్,కారే శ్రీనివాస్, రావు చిన్నారావు, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం, గండేపల్లి



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపిడిఒ ఎం.ఉషారాణి, ఇఒపిఆర్‌డి కె.రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలం కట్టమూరు గ్రామంలో స్వీప్ కార్యక్రమంలో నిర్వహించిన ఓటు వినియోగంపై అవగాహన సదస్సులో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా సగటును 79.77 పోలింగ్ నమోదయిందన్నారు. ఈసారి జరిగే ఎన్నికల్లో 83 శాతం పోలింగ్ నమోదయ్యేలా ఓటర్లు సహకరించాలన్నారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నక్కా వీరవెంకట సత్యనారాయణమూర్తి, జడ్‌పి హైస్కూల్ హెడ్మాస్టర్ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు. సూరంపాలెం ఆదిత్య విద్యా సంస్థల దత్తత గ్రామాలైన అనూరు, కొండపల్లిలో ఓటు హక్కుపై ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఓటు హక్కుల కల్గిన ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా ఓటును వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలని, ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ఒక ఆయుధం వంటిదని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ వి.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ పిఒలు బి.రాంబాబు, ఐ వి.ఆంజనేయులు పాల్గొన్నారు.

నీలపల్లిలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

వైసిపి బిసి సెల్ నాయకులు రెడ్డి సతీష్ ఆధ్వర్యంలో నీలపల్లిలో ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం ప్రారంభించారు. రామచంద్ర కాలనీలో ఇంటింటికి వెళ్లి సిఎం పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రా లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గారావు, రమణ, సతీష్, సాయి, భవాని, మున్ని పాల్గొన్నారు.